నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
19 వ వసంతంలోకి ...
ఎన్టీఆర్ కృష్ణా
మంగళవారం 10 ఫిబ్రవరి 2026 పేజీలు 8




# బాలస్వామి VS మాల్యాద్రి



ఏపీలో టీడీపీ ప్రభుత్వం ఉన్నా విజయవాడ కార్పొరేషన్‌లో మాత్రం వైసీపీదే పెత్తనం. టీడీపీ కార్పొరేటర్లు సంఖ్య తక్కువ. కాని టీడీపీ ఫ్లోర్ లీడర్ మాత్రం తానే మేయర్‌ని అనుకున్నట్లుగా సెంట్రల్ నియోజకవర్గంలో ఎవరు ఫ్లెక్సీ కట్టినా ఎమ్మెల్యే బొండా ఉమాతో పాటు తన ఫోటో ఉండాలని చెప్పినట్లు నియోజకవర్గంలో ప్రచారం జరుగుతోంది. అందుకే ఇటీవల ఎమ్మెల్యే బొండా ఉమా ముఖ్య అనుచరుడు మాల్యాద్రి అనే టీడీపీ నేత తన అభిమాన నాయకుడు ఫ్లెక్సీ కట్టి కార్యక్రమం నిర్వహిస్తే అక్కడకు వచ్చిన టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి తన ఫోటో ఫ్లెక్సీలో ఎందుకు లేదని సదరు మాల్యాద్రిపై దాడి చేయడం ప్రస్తుతం సెంట్రల్ నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

- సెంట్రల్ టీడీపీలో కాక రేపుతున్న వీరిద్దరి మధ్య వివాదం
- ఫ్లెక్సీలో పేరు లేదని దాడి చేయడమా ?
- టీడీపీ ఫ్లోర్ లీడర్ పై సెంట్రల్ వాసుల సెటైర్లు

(విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్)

సాధారణంగా ప్రతి వ్యక్తికి అభిమాన హీరో అనో లేదా అభిమాన నాయకుడో ఉంటారు. వారి తరపున బ్యానర్లు కట్టుకుంటూ వారిపై అభిమానాన్ని చూపిస్తూ ఉంటారు. కానీ సెంట్రల్ నియోజకవర్గంలో కొత్త ధోరణి వచ్చినట్లుంది ఫ్లెక్సీల్లో ఫోటో పెట్టకపోతే ఏకంగా దాడి చేసేంత వరకు వెళ్ళిందంటే 2

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నందిగామ



# ఆయన తీరుమారదా..?

- ఉన్నతాధికారుల ప్రజాప్రతినిధుల అండలు మెండుగా..
- వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోవడంలో ఆయనకు రారు ఎవరూ పోటి
- ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రారే అయినా సబ్ రిజిస్టర్‌కి మించి దోపిడీ
- ఆయన అవినీతి సొమ్ము 100 కోట్లు దాటేనా..?




వివరాలు 2లో...

# సజావుగా ఏపీపీఎస్సీ పరీక్షలు



## అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా సమగ్ర ఏర్పాట్లు

## ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్టీఆర్ జిల్లా, ఫిబ్రవరి 9, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ).. నాలుగు నోటిఫికేషన్లకు సంబంధించి నిర్వహిస్తున్న పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ.. నగరంలోని సీవీఆర్ బాలికల నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేందుకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అటవీ, ఎండోమెంట్ శాఖలకు సంబంధించి వివిధ ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తోందని, ఇవి ఈ నెల 13వ తేదీ వరకు జరుగుతాయన్నారు. విజయవాడ, పరిసర ప్రాంతాల్లోని 15 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయని.. సీటింగ్ అరేంజ్‌మెంట్, ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా ఇలా వివిధ అంశాల్లో ఎక్కడా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. లైజనింగ్, చీఫ్ సూపరింటెండెంట్లతో పాటు సమన్వయ శాఖల అధికారులు 2 లో

(మొదటిపేజీ తరువాయి)

## బాలస్వామి వర్సెస్ మాల్యాద్రి

టీడీపీలో పరిస్థితి ఎంతవరకు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల సింగినగర్‌లో ఎమ్మెల్యే బొండా ఉమా అనుచరుడు ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆ కార్యక్రమానికి వచ్చిన టీడీపీ ఫ్లోర్ లీడర్ తన ఫోటో ఏదని ఉమా అనుచరుడు దేవరపు మాల్యాద్రిని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో వీరిద్దరి మధ్య మాటా మాటా పెరిగి బాలస్వామి మాల్యాద్రిపై దాడి చేయడం నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ తర్వాత ఎమ్మెల్యే బొండా ఉమా దృష్టికి ఈ విషయం వెళ్ళడం తర్వాత ఎమ్మెల్యే సైతం బాలస్వామిపైనే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే వేరే విషయా లు పెట్టుకొని దాడి చేశారా లేక ఫ్లెక్సీల్లో ఫోటోలేదని దాడి చేశారా అనేది ఇద్దరు బయటకచెప్పకపోవడం కొసమెరుపు. అయితే నియోజకవర్గంలో మాత్రం ఫ్లెక్సీలో ఫోటోలేదని దాడి చేయడం ఏంటంటూ గుసగుసలాడుకుంటున్నారు. కొంతమంది ఎమ్మెల్యేకు దగ్గరగా ఉంటూ పెత్తనం చేస్తున్నాడన్న కారణంతోనే దేవరపు మాల్యాద్రిపై దాడిచేసి ఉంటారనుకుంటే మరికొంత మంది మాత్రం ఫెక్సీల్లో ఫోటో లేకపోవడంతోనే బాగా హర్ట్ అయి దాడిచేసి ఉంటా రనే చర్చ జరుగుతుంది. అయితే వీరిద్దరిలో ఒకరైనా బయటకొచ్చి మాట్లాడితే కాని క్లారిటీ వచ్చే అవకాశం లేదనే మాటకూడా వినబడుతుంది. ఏదిఏ మైనప్పటికీ టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి వర్సెస్ ఎమ్మెల్యే బొండా ఉమా అనుచరుడు దేవరపు మాల్యాద్రి మధ్య వివాదం సెంట్రల్ టీడీపీలో మాత్రం కాకరేపుతోంది. చూడాలి వీరిద్దరి మధ్య చెలరేగిన వివాదం ఫులుస్టాప్ పడుతుందో లేదోనని...

## సజావుగా ఏపీపీఎస్సీ పరీక్షలు

సమష్టి కృషితో పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు ఆదేశాలిచ్చామని, ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, పూర్తి భద్రత మధ్య పరీక్షలు రాసేలా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.

### బిషప్ స్కూల్ లో పరీక్షా ఏర్పాట్లను సరిశీలించిన జేసీ



ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)... నాలుగు నోటిఫికేషన్లకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తోంది. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసిన ఏర్పాట్లను పరిశీలించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ సోమవారం నగరంలోని బిషప్ అజరయ్య జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీ క్ష రాసేందుకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలను విజయవంతం గా నిర్వహించేందుకు అధికారులకు సూచనలు చేశారు.

## బొమ్ములూరులో ఉచిత దంత వైద్య శిబిరం



**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 9, మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామంలో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాటూరు విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో పిన్నమనేని డెంటల్ మెడికల్ కాలేజీ సౌజన్యంతో ఈ శిబిరం ఏర్పాటు చేయడం విశేషం. దంత వైద్య ప్రొఫెసర్లు డా. మాధురి, డా. పల్లవి సమంత మరియు వారి వైద్య బృందం గ్రామ ప్రజలకు సేవలందించారు. సుమారు 220 మందికి దంతాలు శుభ్రపరచడం, దంత సమస్యలను గుర్తించడం, అవసరమైన మందులు పంపిణీ చేయడం వంటి సేవలను పూర్తిగా ఉచితంగా అందించారు. దంత ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ సరైన సంరక్షణ విధానాలను వివరించారు. సమస్య తీవ్రత ఉన్న రోగులను ఆసుపత్రికి రప్పించి అక్కడ కూడా పూర్తిగా ఉచిత చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటామని వైద్యులు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించి, ఇలాంటి సేవా కార్యక్రమాలు గ్రామీణ ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ కొమ్మారెడ్డి రాజేష్, పార్టీ అధ్యక్షుడు వేగే కృష్ణారావు, కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గండేపూడి నితీష్, ఉపాధ్యక్షుడు దాసరి రాజేష్, దంత వైద్యులు, ఈఓ, సచివాలయ సిబ్బంది, నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆయన తీరు మారదా..?

**ఉన్నతాధికారుల ప్రజాప్రతినిధుల అండలు మెండుగా..**

**వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోవడంలో ఆయనకు రారు ఎవరూ పోటి**

**ఇన్చార్జి సబ్ రిజిస్ట్రారే అయినా సబ్ రిజిస్టర్‌కి మించి దోపిడీ**

**ఆయన అవినీతి సొమ్ము 100 కోట్లు దాటేనా..?**




**జగ్గయ్యపేట/నందిగామ, ఫిబ్రవరి 9, మేజర్ న్యూస్ :** నందిగామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగే అనేక అవినీతి అక్రమాలపై పలు కథనాలు ప్రచురించినప్పటికీ "అయినా ఆయన తీరు మారదా"(డం) లేదని పలువురు వాబోతున్నారు. రెవిన్యూ డివిజన్ పరిధిలో నందిగామ సబ్ రిజిస్టర్ కార్యాలయం కీలకంగా ఉంది అలాంటి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్ పోస్టు భర్తీ కాకపోవడంతో సీనియర్ అసిస్టెంట్ నే ఇంచార్జి రిజిస్టార్‌గా ఉన్నతాధికారులు నియమించటం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇన్చార్జి సబ్ రిజిస్టర్ మాత్రం వచ్చిన అవకాశాన్ని అదునుగా మార్చుకుని కార్యాలయంలో జరిగే ప్రతి పనికి ఒక రేటును నిర్ణయించి అందని గాడికి దోచుకోవటంలో ఆయనకు ఎవరూ రారు పోటీ అనే విధంగా వ్యవహరిస్తున్నాడు. ఆయన అవినీతిపై పలు కథనాలు వచ్చినప్పటికీ ఆయన తీరులో మార్పు మాత్రం లేదు. అయితే ఆయనకు ఉన్నతాధికారుల ప్రజాప్రతినిధుల అండదండలు మెండుగా ఉన్నాయని ఆయన ప్రచారం చేసుకుంటూ అందిన కాడికి దోచుకుంటున్నాడని ఆరోపణలు బాగా వినిపిస్తున్నాయి. అంతేకాక అవినీతి శాఖలో కూడా తన అనుచరులు ఉన్నారని ఆ శాఖకు కూడా మామూళ్లను అందించడం జరుగుతుందని చెప్పుకోవడం కొసమెరుపు. అవినీతి శాఖ వారు ఈ కార్యాలయం పై వల వేస్తున్నారని సమాచారంతో ఆయన ముందుగానే సెలవులపై వెళ్లి ఆ తరువాత కార్యాలయానికి రావడం వచ్చి సంతకాలు పెట్టడం కార్యాలయ సిబ్బందినే ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇన్చార్జి సబ్ రిజిస్టర్ అయినప్పటికీ ఆయన సరియైన సమయపాలన నిలువు దోపిడిని చూస్తుంటే ఆయనకు ఉన్నతాధికారుల ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయని ఆయన ప్రచారానికి అద్దం పట్టినట్లుగా ఉంది అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆయన అవినీతి సొమ్ము దాదాపుగా 100 కోట్లు దాటినట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. ఈ విధంగా నందిగామ ఇన్చార్జి సబ్ రిజిస్టర్ ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుంటూ దస్తాలేఖర్ల సహాయంతో కార్యాలయానికి వచ్చిన వారి నుండి భారీగా అక్రమ వసూల్ కు పాల్పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆయన అడిగిన రేటును ఇవ్వకపోతే ఏదో ఒక కొర్రు బిగించి ఆ ఫైల్ ముందుకు వెళ్లకుండా చేసి అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజలు బాటసంగా చర్చించుకుంటున్నారు. కనుక ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు, అవినీతి నిరోధక శాఖ అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపించి నందిగామ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై అడ్డుకట్ట వేసి ఈ కార్యాలయం ద్వారా జరిగే వివిధ రకాల శాఖాపరమైన సేవలు సక్రమంగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## మహిళా స్వావలంబనకు మమతల పందిరి దోహదం



**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 9, మేజర్ న్యూస్ :** మమతల పందిరి సేవలు శ్లాఘనీయమని గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు అన్నారు. మమతల పందిరి సేవా సమితి ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాలుగా వీరవల్లి గ్రామంలో 173 మందికి కుట్టు మరియు జూట్ బ్యాగుల తయారీ శిక్షణ విజయవంతంగా నిర్వహించిన అనంతరం, సోమవారం దంటగుంట్ల గ్రామంలో నూతనంగా ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చలమలశెట్టి రమేష్ బాబు మాట్లాడుతూ, వీరవల్లి గ్రామంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా 173 మందికి శిక్షణ ఇచ్చి వారిని స్వావలంబన దిశగా తీర్చిదిద్దిన విషయం అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. మహిళల అభ్యర్థన మేరకు దంటగుంట్లలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించడం అభినందనీయమని కొనియాడారు. మమతల పందిరి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు లంక రమేష్ మాట్లా డుతూ, తమ సమితి ద్వారా ఇప్పటివరకు 172 సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వ హించామని తెలిపారు. మహిళా స్వావలం బన లక్ష్యంగా ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాలను విస్తరిస్తున్నా మని చెప్పారు. దంటగుంట్ల గ్రామ సర్పంచ్ యజ్జవరపు రంగారావు, తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, కాకులపాడు డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్‌ల సహకారంతో ఈ కేంద్రం ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. మమతల పందిరి కోఆర్డినేటర్ కరకట్ల రాధికా నాయుడు మాట్లాడుతూ, జూన్ 25 ఉదయం 10.44 గంటలకు వీరవల్లి గ్రామంలో రాజా రామ్మోహనరావు బేబీ సరోజినీ దేవి దంపతుల విరాళ సహకారంతో మమతల పందిరి వృద్ధాశ్రమం భూమిపూజ జరగనున్నదని తెలిపారు. ఈ వృద్ధాశ్రమం ద్వారా సేవా కార్యక్రమాలు మరింత విస్తృతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, ఆశాజ్యోతి మానసిక వికలాంగుల కేంద్రం చైర్మన్ మరీదు మాధవీలత, వడ్డి వాసవీ దేవి, సుంకర సాంబశివరాయల్, వడ్డీల లక్ష్మీకుమారి, యజ్జవరపు శ్రీనివాస్, బంగారమ్మ తదితరులు అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.



## క్యాన్సర్ బాధితురిలికి సహాయం

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు సాలిపేటకు చెందిన క్యాన్సర్ బాధితురాలు కారుమూరి సుమతిని అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పరామర్శించారు. చికిత్స వివరాలు, కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. బాధితురాలు నిరుపేద కుటుంబం కావటంతో గ్రామానికి చెందిన యార్లగడ్డ ట్రేడర్స్ అదినేత యార్లగడ్డ శ్రీనివాసరావు-నాగరాణి దంపతులు రూ. 5వేల సహాయాన్ని కనపర్తి శ్రీనివాసరావు చేతులమీదుగా బాధిత మహిళకు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## 150మంది ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వారి ఉచిత వైద్యం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వారు మండలంలోని ఉలవలపూడి గ్రామ పంచాయితి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 150మందికి సేవలు అందించారు. ఈ కార్యక్రమాన్ని ఆ గ్రామ సర్పంచి పామర్తి కన్య భాస్కరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. నేత్ర సమస్యలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు హనుమకొండ దుర్గాభవాని, కణితి శశిరేఖ వైద్యం అందించటమే గాక నేత్ర శస్త్ర చికిత్సల కొరకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు పామర్తి రామయ్య, సాగునీటి 105 సంఘాధ్యక్షుడు పామర్తి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా ఉద్యోగులకు ప్రత్యేకప్యాకేజీలు



మొవ్వ మేజర్ న్యూస్ : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ‌లోని రాష్ట్ర శాశ్వత ఉద్యోగులకు ప్రత్యేక వేతన ప్యాకేజీలు అందిస్తున్నట్లు మండలంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్లు సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారిడి.సుహాసిని కలిసి తమ బ్యాంకు కార్యాచరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓతో మాట్లాడుతూ వ్యక్తిగత ప్రమాద భీమాకు 18 నుంచి 62 సంవత్సరాల వరకు 120 లక్షల,టర్మ్ ఇన్సూరెన్స్ పది లక్షల, డెబిట్ కార్డుతో ఉచిత విమాన ప్రమాద బీమా పథకంకు 200 లక్షల రూపాయలు, వైద్యం నిమిత్తం ఉచిత హాస్పిటల్ నగదు కొరకు 30 వేల రూపాయలు అందించనున్నట్లు బ్యాంక్ అధికారులు వివరించారు. అలాగే రుణాల సదుపాయాలలో 25 లక్షల రూపా యల గృహ నిర్మాణా రుణానికి ప్రాసెసింగ్ చార్జి నూరు శాతం రాయితీ, ఇతర రుణాల ప్రాసెసింగ్ చార్జి 50% రాయితీ, గృహ రుణాలపై వడ్డీ రేటు 0.05 శాతం, వాహన రుణాలపై వడ్డీ 0.10 శాతం, 7.50 లక్షల లోపు విద్యా రుణంకు 0.10 శాతం తగ్గింపు తదితర సమాచారాన్ని ఆమెకు తెలియజేశారు. మండల పరిషత్ అధీనంలో పనిచేస్తున్న ఉద్యోగులందరు యూనియన్ బ్యాంకు కల్పిస్తున్నఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనే విధంగా అవగాహన కల్పించి వ్యాపార అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీడీఓ సుహాసినిని కోరారు. ఎంపీడీఓ సుహాసినినితో మేనేజర్లు సి.హెచ్.పరమేష్ (పెదపూడి), ఎం.దిలీప్ చంద్ (భట్లపెనుమర్రు),ఎస్.ధన కుమార్ (నిడుమోలు),బి. యాకన్న(కాజ)లు బ్యాంకు కల్పిస్తున్న రాయితీకి సంబంధించిన కరపత్రాలు అందజేశారు.

# గోద్రేజ్ ఆగ్రోవెట్ 'టకాయ్' మార్కెట్లోకి విడుదల




విజయవాడ మేజర్ న్యూస్ : గోద్రేజ్ ఆగ్రోవెట్ సరికొత్త కీటక నాశని టకాయ్ మార్కెట్లోకి విడుదలైంది. ఈ సందర్భంగా విజయవాడలోని ఓ హోటల్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో గోద్రేజ్ ఆగ్రోవెట్ క్రాప్ ప్రొడక్షన్ బిజినెస్ సీఈవో ఎస్ కే రాజవేలు మాట్లాడుతూ భారతదేశంలో వైవిధ్యభరితమైన వాతావరణంలో వరి సాగు చేసిన రైతుల ప్రయోజనాల కోసం తమ సంస్థ టకాయ్ ని అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. జపాన్ కు చెందిన ఐఎస్కే సంస్థ సైక్లానిప్రిన్ టీహెచ్ఎం టెక్నాలజీతో ఈ టకాయ్ ని రూపొందించిందని తెలిపారు. వరిలో ప్రధానంగా కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పరుగులను నాశనం చేయడంలో ఇది అత్యంత ప్రభావవంతంగా పని చేస్తుందని వివరించారు. నాట్లు వేసిన తర్వాత కీలకమైన ప్రాథమిక దశ అయిన 15 నుంచి 30 రోజుల మధ్య ఒకసారి, మళ్లీ 40 నుంచి 60 రోజుల మధ్యలో ఒకసారి 160 మిల్లీ లీటర్ల మోతాదులో పిచికారీ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ మందు పంటలను ఆశించిన పురుగులు ఆహారం తీసుకోకుండా తక్షణమే అడ్డుకుంటుందని, దీర్ఘకాలం పాటు తెగుళ్లను అదుపు చేస్తుందని తెలిపారు. దీనివల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని, ఉత్పత్తి పెరుగుతుందని, స్థిరమైన మంచి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. టకాయ్ అనేది వరితోపాటు మొక్కజొన్న, మిరప, క్యాబేజీ, సోయాబీన్, శనగ, చెరుకుబ పంటలకు కూడా వినియోగించవచ్చని వివరించారు. రైతుల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ కోసం తమ సంస్థ చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. ఈకార్యక్రమంలో జోనల్ హెడ్ మధు, అసిస్టెంట్ మేనేజర్ మురళీ మోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# కానూరులో ఐస్‌క్రీమ్ బ్రాండ్ డ్యూమాంట్ 50వ బ్రాంచ్ ప్రారంభం




విజయవాడ మేజర్ న్యూస్ : కానూరు సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీకి ఎదురుగా ప్రముఖ ఐస్‌క్రీమ్ బ్రాండ్ డ్యూమాంట్ తమ 50వ బ్రాంచ్ ను లాంఛనంగా ప్రారంభించారు. వై బి వెనిలా అనే వినూత్న నినాదంతో మార్కెట్లో లభించే సాధారణ ఐస్‌క్రీమ్‌లకు భిన్నంగా రొటీన్ ఫ్లేవర్లను కాకుండా సరికొత్త కాంబినేషన్లను తాము పరిచయం చేస్తున్నామని నిర్వాహకులు వివరించారు. ఇందులో భాగంగా పైనాపిల్‌ను కారమెల్ సాస్‌లో సుమారు 24 గంటల పాటు నానబెట్టి తయారుచేసే ఐస్‌క్రీమ్ వంటి విభిన్న రుచులు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, కృత్రిమ ఎసెన్స్‌లకు దూరంగా ఉంటూ కేవలం అత్యంత నాణ్యమైన, సహజసిద్ధమైన ఇంగ్రిడియంట్స్‌తోనే ఐస్‌క్రీమ్‌లను తయారు చేయడం డ్యూమాంట్ ఐస్‌క్రీమ్స్ యొక్క ప్రధాన బలమని చెప్పారు. భారతదేశంలో సగటున ఒక వ్యక్తి 400 మి.లీ ఐస్‌క్రీమ్ మాత్రమే తింటుంటే, అమెరికా వంటి దేశాల్లో అది 20 లీటర్లుగా ఉందని, ఆ స్థాయి అంతర్జాతీయ ప్రమాణాలతో తాము పోటీ పడుతున్నామని వారు పేర్కొన్నారు. ఇప్పటికే అమెరికా లో 15 బ్రాంచ్ లు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం తమసంస్థ విజయ డెయిరీ, జెప్టో, స్విగ్గీ వెన్యూ, మోడల్ డెయిరీ, వశిష్ట శ్రీ లక్ష్మి వంటి ప్రముఖ సంస్థల తో భాగస్వామ్యం కలిగి ఉందని అన్నారు. అంతర్జాతీయంగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తూ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదుగుతోందన్నారు. వ్యవస్థాపకులు, తమ తండ్రి నాగేశ్వరరావు మార్గదర్శకత్వంలో ప్రారంభమైన ఈ సంస్థను, అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. దక్షిణ భారతదేశం నుండి నేరుగా అమెరికా మార్కెట్‌లోకి ప్రవేశించాలనే భారీ లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేసి లక్ష్యాన్ని చేరుకున్నామని వివరించారు. కానూరు ప్రాంతంలోని ఐస్‌క్రీమ్ ప్రియులకు ఇప్పుడు ఈ అంతర్జాతీయ స్థాయి రుచులను స్థానికంగానే ఆస్వాదించే అవకాశం దొరికిందని తమ సంస్థను విజయవాడ ప్రజలు ఆదరించాలని కోరారు.






## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలి

మచిలీపట్నం మేజర్ న్యూస్ : జిల్లాలో ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు.సోమవారం సాయంత్రం నగరంలోని కలెక్టరేట్ విసి హాలులో జిల్లా కలెక్టర్ భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 నుండి 13 తేదీ వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవం సందర్భంగా, ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంపొందించేందుకు రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ప్రజలు సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో ఆర్థిక అక్షరాస్యత ఎంతో కీలకమని, సురక్షిత బ్యాంకింగ్ విధానాలు, డిజిటల్ లావాదేవీలు, పొదుపు అలవాట్లు, ఆర్థిక మోసాల నుంచి రక్షణపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ వారోత్సవం ద్వారా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు బాధ్యతాయుత ఆర్థిక ప్రవర్తనపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, ఎల్డిఎం రవీంద్రారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## లేగ దూడల అందాల పోటీలు



మొవ్వ మేజర్ న్యూస్: మండల కేంద్రమైన మొవ్వ ప్రాంతీయ పశు వైద్యశాలలో రాష్ట్రీయ గోకుల మిషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ ఉదయం 8 గంటలకులేగ దూడల అందాల పోటీలు నిర్వహిం చనున్నట్లు మొవ్వ ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్.కె. రవీంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు పోషకులు సంవ త్సరంలోపుఆడ దూడలను తీసుకొని వచ్చి అందా ల పోటీలలో పాల్గొని రాష్ట్రీయ గోకుల మిషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేసే బహుమతులను అందు కోవాలని అలాగే ప్రతి దూడకు అవసరమైనటువంటి మందులు, విటమిన్స్ అందజేస్తున్నామని తెలిపా రు. అలాగే దూడల పోషణ గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈఅవకాశాన్నిమొవ్వ పరిసర ప్రాంతపశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్.రవీంద్రరావు కోరారు.



## ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం...

మైలవరం, మేజర్ న్యూస్ : ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం, ఊరి బడిని కాపాడుకుందాం అనే నినాదంతో ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్" (యుటిఎఫ్) ఆధ్వర్యంలో ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేర్పించాలని కోరుతూ ఏర్పాటుచేసిన "గోడ పత్రిక"ను మండల విద్యాశాఖ అధికారులు బండి రాజు, ఎల్ బాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి బండి రాజు మాట్లాడుతూ ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి యుటిఎఫ్ మండల శాఖ చేస్తున్న కృషిని అభినందించారు. ఎంఈఓ 2 బాలు మాట్లాడుతూ ప్రభుత్వ బడులను కాపాడడంలో యుటిఎఫ్ చేస్తున్న కృషి ఫలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కెంగగరాజు, మైలవరం మండల అధ్యక్షులు ఎం తిరుపతి రావు, ప్రధాన కార్యదర్శి వసంతరావు వాడపల్లి కార్యదర్శులు డి శ్రీనివాసరావు, ఈ కృష్ణ ప్రసాద్, విజయలక్ష్మి,లలిత కుమారి, బి సూర్య, ఏ శ్రీను, యై.జాన్, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు, పేషెంట్‌లకు ఫ్రూట్స్, రొట్టెలు పంపిణీ




పెడన, మేజర్ న్యూస్ : ఇక పై ప్రతి నెల 9 వ తారీకు పెడన లయన్స్ క్లబ్ ఆధ్వర్యములో గర్భిణీ స్త్రీలకు, రోగులకు పోషకాహార పంపిణీ కార్యక్రమం ఆ సంస్థ అధ్యక్షుడు బెజవాడ నాగరాజు తెలిపారు. ఈ మేరకు పెడన లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ యొక్క కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ ప్రతినెల 9న జరుగు గర్భిణీ స్త్రీల హెల్త్ చెకప్ నిమిత్తం వచ్చే గర్భిణీ స్త్రీలకు గూడూరు ఓంకారేశ్వర శర్మ సహకారంతో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ యర్రపోతు నాగేశ్వరరావు, పెడన లయన్స్ క్లబ్ కోశాధికారి మామిడి ప్రసాద్ లయన్స్ క్లబ్ సభ్యులు చోడవరపు అప్పారావు, వెలివల రాఘవులు, రాయన లక్ష్మీ, జల్లూరి కోటేశ్వరావు, పామర్తి పైడేశ్వరరావు, జంపాన శ్రీను, బోలెం భగవాన్, సత్యసాయి సేవా సమితి సభ్యులు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కళాశాల విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన



పామర్రు మేజర్ న్యూస్ : పామర్రులోని ప్రసన్న జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు వివిధ అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల నివారణ, పిల్లల రక్షణ, సైబర్ నేరాలు, రహదారి భద్రత తదితర విషయాలపై స్థానిక ఎస్సై విజయ భాస్కర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత లో భాగంగా హెల్మెట్ ధరించడం, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని, మైనర్లు వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని వివరించారు. చట్టాలను ఉల్లంఘిస్తే ఎదురయ్యే న్యాయ పరమైన పరిణామాలను విద్యార్థు లకు తెలియజేస్తూ, బాధ్యతాయుత పౌరులుగా మారాలని సూచిం చారు. మత్తు పదార్థాలు, గంజాయి వినియోగానికి దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ విషయాలను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా చేరవేసి పోలీస్ శాఖకు సహకరించాలని విద్యార్థులను ఆయన కోరారు.

**టైటిల్ డీడ్ పోయినది**

మన్నే వెంకయ్య తండ్రి లక్ష్మయ్య అను వారు పొలంపల్లి గ్రామంలో 1870/1996 నెంబర్ గల రిజిష్టర్ డాక్యుమెంట్ పొలంపల్లి గ్రామం నుండి వత్సవాయి గ్రామంలో జిరాక్స్ కొరకు వెళ్ళిన సమయంలో డాక్యుమెంట్ పోయినది. దొరికిన వారు ఈక్రింది నెంబర్‌కు తెలియజేయగలరు. తెలియజేసిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును.

7396385737



## ఫిర్యాదుల పట్ల వెంటనే స్పందించి, పరిష్కరించాలి

### అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.వి నాయుడు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మీకోసం కార్యక్రమం ద్వారా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల ఫిర్యాదులను స్వయంగా స్వీకరించిన అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.వి నాయుడు. మీకోసం ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పట్ల వెంటనే స్పందించి,తక్షణమే పరిష్కరించాలి.ప్రజలు నిత్యజీవితంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారం కోసం మీకోసం కార్యక్రమాన్ని జిల్లా పోలీసు శాఖ తరపున నిర్వహిస్తున్నారు. ఫిర్యాదులను స్వీకరించి, సమస్య తీవ్రత ఆధారంగా వాటిని సంబంధిత అధికారులకు బదిలీ చేసి, వాటిపై పరిష్కారం లభించేలా, సమస్యలను ప్రత్యేకంగా తెలుసుకుంటూ ఫిర్యాదుదారులతో ముఖాముఖి సంభాషిస్తూ వారి సమస్యలకు తక్షణ పరిష్కారం అందించే దిశగా కృష్ణాజిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుంది. అని తెలిపారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.వి నాయుడు మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు దారుల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులకు, సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు. మీకోసం కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. సోమవారం మీకోసం కార్యక్రమానికి మొత్తం 40 ఫిర్యాదులు అందాయి.

## కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే వంశీ



**గన్నవరం, ఫిబ్రవరి 9, మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా ప్రజా సమస్యలపై గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కలెక్టర్‌ను కలిశారు. వివిధ ప్రజా సమస్యలతో కూడిన అర్జీని పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న 2,400 ఇళ్ల పట్టాలను సత్వరమే అర్హులైన లబ్ధిదారులకు అందజేయాలని వంశీ కోరారు. అలాగే గన్నవరం విమానాశ్రయ విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు అమరావతిలో ఇస్తామని హామీ ఇచ్చిన పట్టాలను తక్షణమే అందజేయాలని కలెక్టర్‌ను వల్లభనేని వంశీ విజ్ఞప్తి చేశారు.

## పదో తరగతి పబ్లిక్ పరీక్షల సిద్ధతపై పరిశీలన



**గన్నవరం, ఫిబ్రవరి 9, మేజర్ న్యూస్ :** గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల విద్యా ప్రగతిని గుడివాడ ఉప విద్యా శాఖాధికారి కొండా రవి కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతులను సందర్శించి విద్యార్థుల చదువు స్థాయి, పునశ్చరణ తరగతులు, పరీక్షల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లపై ఆరా తీశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమని పేర్కొంటూ, పరీక్షలను ఆత్మవిశ్వాసంతో, ఒత్తిడిలేకుండా రాయాలని విద్యార్థులకు సూచనలు చేశారు. అదేవిధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతి విద్యార్థికి అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఏ. సునీల పాల్గొని పరీక్షల సిద్ధతకు సంబంధించి పాఠశాల తీసుకుంటున్న చర్యలను వివరించారు.

# జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 192 అర్జీలు

### 54 రెవెన్యూ, 138 నాన్ రెవెన్యూ అర్జీలు

### ప్రతి అర్జీకి ప్రత్యేక దృష్టితో పరిష్కారం

### జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ



**విజయవాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జిల్లాస్థాయి కార్యక్రమం ద్వారా మొత్తం 192 అర్జీలు వచ్చాయని.. వీటిలో 54 రెవెన్యూ అర్జీలు కాగా 138 రెవెన్యూయేతర అర్జీలు ఉన్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ.. అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నాన్ రెవెన్యూ అర్జీల్లో పురపాలక శాఖకు సంబంధించి 31, పోలీసు శాఖకు 27, డీఆర్‌డీఏకు 25, పంచాయతీరాజ్ శాఖకు 12 అర్జీలు వచ్చాయన్నారు. విద్యుత్, పౌర సరఫరాలు, ఆరోగ్య శాఖలకు అయిదు చొప్పున అర్జీలు రాగా సీఆర్‌డీఏకు సంబంధించి నాలుగు అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. వ్యవసాయం, ఇరిగేషన్‌కు మూడు చొప్పున అర్జీలు రాగా, విద్య, నైపుణ్యాభివృద్ధి, సర్వే, సాంకేతిక విద్యకు రెండు చొప్పున అర్జీలు వచ్చాయన్నారు. ప్రజా రవాణా, ఎండోమెంట్, మైనారిటీ సంక్షేమం, ఎల్‌డీఎం, పరిశ్రమలు, మైన్స్, కాలుష్య నియంత్రణ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, గ్రామీణ నీటి సరఫరా, రహదారులు-భవనాల శాఖలకు ఒకటి చొప్పున అర్జీలు వచ్చాయని వివరించారు. ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించి నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యకు సరైన పరిష్కారం చూపడంలో చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.

# యువత కోసం మంత్రి లోకేష్ ఉద్యోగాల ఉద్యమంనకు శ్రీకారం

### బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పి. వి. ఫణి కుమార్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ మచిలీపట్నంలో ఆయన కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ,హై పేయింగ్ ఉద్యోగాలు అంటే మన ఆంధ్ర ప్రదేశ్ యువత మొన్నటి వరకు బెంగుళూరు, హైదరాబాదు, చెన్నై వంటి నగరాల వైపు చూసేవాళ్ళని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి అతివేగంగా మారుతోందని అన్నారు. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో మన ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల జాతర మొదలైంది అని అన్నారు.యువగళం పాదయాత్రలో నారా లోకేష్ యువతకు మాట ఇచ్చినట్టే మన రాష్ట్రంలో లక్షల ఉద్యోగాలకు నాంది పలుకుతున్నారు అన్నారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విశాఖలో గూగుల్ డేటా సెంటరుతో మొదలైన ఈ ఉద్యోగాలు ఉద్యమం. క్వాంటం వ్యాలీతో ఫిక్స్ కు చేరింది అన్నారు. ఒక్క క్వాంటం వ్యాలీ లో పది లక్షల ఉద్యోగాలు మంత్రి నారా లోకేష్ యువతకు అందిస్తున్నారు అన్నారు. మంత్రి నారా లోకేష్ ఇక ఏఐ యూనివర్సిటీతో పాటు అనేక టెక్ సిటీలకు మన అమరావతి కేంద్రం కాబోతోంది అన్నారు. రాష్ట్రంలో వచ్చే ఐదు ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు యువతకు కల్పించడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యం అన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్, కొనకళ్ళ నారాయణరావు ల సారధ్యంలో మచిలీపట్నం పోర్టు టు అమరావతికి రోడ్డు మార్గాలు వేసేందుకు పెద్ద ఎత్తున మన నాయకులు నిధులు తెచ్చి, చక్కటి ప్రణాళికలు రూపొందిస్తున్నారని, మచిలీపట్నం పోర్టుతో మన జిల్లా యువతకు మన నాయకులు ద్వారా ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తున్నాయి అన్నారు.రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేని వైసిపి నాయకులు రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి వారిని ప్రజలు తరిమి తరిమి కొట్టాలని పి. వి. ఫణి కుమార్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంజాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చెయ్యాలి



**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 09, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం(ఏపిడికెఎస్) ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం. కుటుంబరావు ఆధ్వర్యంలో పట్టణంలో తహసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం డప్పు కళాకారుల ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసిల్దార్ కార్యాలయం సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబరావు మాట్లాడుతూ పాటకు, ఆటకు గుర్తింపునిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డప్పుకు ఎందుకు గుర్తింపునివ్వడం లేదని మండిపడ్డారు. డప్పులు వాయించేది దళితులు కాబట్టే అంటరానివారిగా వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేర్చుకున్న కళలకు రూ.7 వేల పెన్షన్ ఇస్తుండగా, ప్రాచీన కళ డప్పును నమ్ముకున్న కళాకారులకు రూ. 4 వేలే ఇస్తారా..? ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. డప్పు కళాకారుల వయోపరిమితిని 45కు తగ్గించి పెన్షన్ రూ. 7 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం గడిచిపోయినా ఇప్పటివరకు డప్పు కళాకారుల పెన్షన్‌కు ఆన్లైన్ ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డప్పు కళాకారులకు ధార్మిక క్షేత్రాల్లో ప్రదర్శనలకు, ట్రస్ట్ బోర్డుల్లో మెంబర్ గా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గుర్తింపు కార్డులివ్వడంతో పాటు బస్సు, రైలు ప్రయాణాల్లో రాయితీ ఇవ్వాలని సూచించారు. ఉండడానికి ఇల్లు, వ్యవసాయానికి రెండెకరాల భూమిని మంజూరు చేయాలన్నారు. డప్పు కళ అంతరించిపోకుండా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. రూ.10 లక్షల ప్రమాద బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. డప్పు కళాకారులు సమరశీల ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోగలరని నాయకులు పిలుపునిచ్చారు, డప్పు కళాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఐ యాకోబు, ఆదిమల్ల నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోట కృష్ణ, డప్పు కళాకారుల సంఘం ప్రతినిధులు ఆదిమల్ల సుధాకర్, నెమలి ఆదాం, ఇనుపనూర్తి నాగేశ్వరరావు, హుసేన్ డప్పు కళాకారులు పాల్గొన్నారు.



## బాల్య వివాహా ముక్తి రధాన్ని ప్రారంభించిన కలెక్టర్ బాలాజీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో బాల్య వివాహాలు నిరోధించడానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకొని తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్‌లో బాల్య వివాహ ముక్త్ భారత్ 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం మహిళా, శిశు సంక్షేమ శాఖ వారు, వాసవ్య మహిళా మండలి స్వచ్ఛంద సంస్థ వారు బాల్య వివాహా ముక్తి రథాన్ని ఏర్పాటు చేశారు. ఈ బాల్య వివాహ ముక్తి రథాన్ని జిల్లా కలెక్టర్ డి కే బాలాజీ జండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐ సి డిఎస్ పీడీ యం ఎన్ రాణి, డీసీపీవో బి కిషోర్, బి.కీర్తి, రామానుజయ్య, యం. దివ్య, సి హెచ్ ఉష ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ



మొవ్వ మేజర్ న్యూస్ : మండల పరిధిలోని కూచిపూడి గ్రామానికి సంబంధించిన నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సోమవారం భూమి పూజ చేసిపనులు ప్రారంభించారు. కూచిపూడి పంచాయతీ పరిధిలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలం లేకపోవడంతో కూచిపూడి గ్రామ సర్పంచ్ దంపతులతో పాటు మరి కొంత మంది దాతల సహకారంతో పెదపూడి పంచాయతీలో స్థలాన్ని కొనుగోలు చేసి ఆ స్థలంలో 33/11 కె.వి.సబ్ స్టేషన్ను 4 కోట్లవ్యయంతో నిర్మించటానికి శంకుస్థాపన కార్యక్రమం పెదపూడిలో నిర్వహించారు. ఏపీ సి పి డి సి ఎల్ ఆధ్వర్యంలో నిర్మించే 33/11 కె.వి. విద్యుత్ ఉపకేంద్రంశంకుస్థాపన కార్యక్ర మంలో శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా తోపాటు వారితోపాటు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ యల్. రామలింగేశ్వ రరావు, ఏఎంసి చైర్మన్ డి.శివరామయ్య, కూచిపూడి, పెదపూడి గ్రామ సర్పంచులు కొండవీటి వెంకటరమణ విజయ లక్ష్మి, తాతా రజని, స్థలదాత కొండవీటి. అమర బాలేశ్వరరావు, విద్యుత్ శాఖ ఎస్.ఇ.వి.వి. చిరంజీవి,ఇ.ఇ.జి. గోవింద రావు(ఆపరేషన్ మచిలీపట్నం), డి.ఇ.ఇ.కే. సుందరరావు (ఆపరేషన్ పామర్రు), పి.విజయ భాస్కర్(ఇ.ఇ.కన్స్ట్రక్షన్),కే. నారాయణ (డి.ఇ.ఇ), మొవ్వ విద్యుత్ సబ్ స్టేషన్ ఎ.ఇ కె.వి.వి.ఎన్.రమేష్ బాబు, ఎం.రామ కృష్ణ(ఏ.ఇ)లతో పాటు కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేనేత గర్జన కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం ప్రారంభం

పెడన, మేజర్ న్యూస్ : ఛలో మంగళగిరి– చేనేత గర్జన ఈనెల 22వ తారీఖున నిర్వహించనున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ యొక్క గర్జన కార్యక్రమ ప్రచారాన్ని ప్రారంభించామని చేనేత జాతీయ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సత్తెనపల్లి పట్టణంలో ఫణిదం చేనేత సహకార సంఘంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఈనెల 22వ తారీఖున చేనేత గర్జన కార్యక్రమానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాన్ని ఫిబ్రవరి 6, 2026 శుక్రవారం గుంటూరు జిల్లాలో, ఫిరంగిపురంలో సత్తెనపల్లిలో, ఇలా అనేక చోట్ల గల చేనేత సహకార సంఘాల వద్ద ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రపంచ ప్రసిద్ధి పొంది వేలాది కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని భారతదేశానికి ఆర్జించి పెడుతున్న చేనేతకళను రక్షించుకోవడానికి, చేనేతల న్యాయ సమ్మతమైన డిమాండ్లను సాధించుకోవడానికి, హక్కులను రక్షించుకోవడానికి, సమస్త చేనేత ప్రజానీకానికి సంక్షేమ ఫలాల సాధన, సమన్యాయం కోసం ఆదివారం ఫిబ్రవరి 22, 2026, మంగళగిరిలో నిర్వహించనున్న చేనేత గర్జన కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రచార కార్యక్రమంలో విస్తృతంగా పర్యటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలమర్రి నాగేశ్వరరావు పిల్లలమర్రి బాలకృష్ణ, కట్ట దుర్గారావు, రామనాథం పూర్ణచంద్రరావు, పసల తామస్, స్థానిక చేనేత సంఘాల ప్రతినిధులు, నాయకులు, చేనేత సామాజికులు పాల్గొన్నారు.





## మహా శివరాత్రికి ముస్తాబవుతున్న శివాలయాలు

అవనిగడ్డ మేజర్ న్యూస్ : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అవనిగడ్డ పరిధిలోని శివాలయాలు భక్తుల రాకకు సర్వాంగ సుందరంగా సిద్ధమవుతున్నాయి. ఆలయ ప్రాంగణాలు విద్యుత్ దీపాలతో, పూలతో, తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించబడుతున్నాయి. శివాలయాల్లో శుభ్రత కార్యక్రమాలు వేగంగా కొనసాగుతుండగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. మండల పరిధిలోని పాత ఎడ్లంక గ్రామంలో కొలువైయున్న పురాతన బాల కోటేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాట్లను దేవాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి వాసు అవనిగడ్డ ఎస్సై శ్రీనివాసులు పర్యవేక్షించి. కృష్ణానది వద్ద భక్తుల స్నానాలకు ఇబ్బందులు లేకుండా స్నానఘాట్లను పరిశీలించారు. స్థానిక రాజరాజేశ్వరి సమేత రాజశేఖర స్వామి ఆలయం, మండల పరిధిలోని వేకనూరు, మోదుమూడి, దక్షిణ చిరువోలులంక, గ్రామాలలోని శివాలయాల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, క్యూలైన్లు, వైద్య సదుపాయాలు, పోలీసు భద్రత వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.

# గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యం



పెదపారుపూడి మేజర్ న్యూస్ : గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయటమే లక్ష్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ సోమవారం మండల కేంద్రమైన పెదపారుపూడిలో శ్రీకారం చుట్టారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి చెందినా ప్రజా క్షేత్రంలో ప్రజల కోసం, వైఎస్సార్ కార్యకర్తల కోసం పూర్తి సమయాన్ని కేటాయిస్తున్న ఆయన మరో అడుగు ముందుకు వేసి పార్టీ బలోపేతం చేసే కార్యక్రమాలను చేపట్టారు. కూటమి ప్రభుత్వ వరుస వైఫల్యాల నేపథ్యంలో ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తూనే, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టామని ఈ సందర్భంగా అనిల్ కుమార్ తెలిపారు. పామర్రు నియోజకవర్గంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీల నియామక కార్యక్రమంలో భాగంగా పెదపారుపూడి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలంగా నిలబెట్టే విధంగా స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.పార్టీ బలోపేతంలో ప్రతి కార్యకర్త పాత్ర అత్యంత కీలకమని, గ్రామస్థాయి నుంచి ప్రజలతో బలమైన అనుబంధం పెంచుకోవాల్సిన అవసరం ఉందని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పెదపారుపూడి గ్రామ పార్టీ కమిటీలను ప్రకటించారు. పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేస్తూ, భవిష్యత్తు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామ పార్టీ అధ్యక్షులుగా కూరాకుల దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా దగాని వెంకటేశ్వరరావు లను నియమించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గోగం సురేష్, పలువురు మండల స్థాయి పార్టీ నాయకులు, గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ దంపతులు



గన్నవరం, ఫిబ్రవరి 9, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు సోమవారం ఉదయం కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శనం ద్వారా స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ నిబంధనల ప్రకారం దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. దర్శనానంతరం యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అందరిపై ఆ దేవదేవుని ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. తనను గెలిపించిన గన్నవరం నియోజకవర్గ ప్రజలకు నిరంతరం సేవ చేసే భాగ్యం కలగాలని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అవసరమైన శక్తిని, దీవెనలను ప్రసాదించాలని స్వామివారిని కోరుకున్నారు.

## నూతన వస్త్ర బహూకరణ వేడుకలలో ఎమ్మెల్యే



పామర్రు మేజర్ న్యూస్: పామర్రు టౌన్ చెన్నువానిపురంలో సోమవారం జరిగిన గుమ్మడి అశోక్ కుమార్తె నూతన వస్త్రబహూకరణ వేడుకలలో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి అనుశ్రీ ని ఆశీర్వదించి అశోక్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పార్టీ నాయకులు చాట్ల రమేష్, పరసా సుబ్రహ్మణ్యం, మంతెన రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వర్క్‌షాప్



మైలవరం, మేజర్ న్యూస్ : లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో "ఎస్సెంటిల్స్ అఫ్ జావా అండ్ పైథన్"అంశంపైరెండు రోజుల వర్క్‌షాప్ ను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే అప్పారావు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో జావా, పైథన్ ప్రోగ్రామింగ్ భాషల ప్రాథమిక అంశాలు, ఆబ్జెక్ట్ ఓరియెంటెడ్ ప్రోగ్రామింగ్ కాన్సెప్ట్, రియల్ టైమ్ అప్లికేషన్‌లలో జావాపైథాన్ ఉపయోగాలు, సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో అవసరమైన ప్రోగ్రామింగ్ నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రాడ్యకీ టెక్నాలజీస్ చెన్నైలో అకాడమిక్ డైరెక్టర్ & టెక్నికల్ ట్రైనర్ దా సందర్ రాజన్, సీనియర్ టెక్నికల్ లీడ్ శ్రీకాంత్ విద్యార్థులకు ప్రాక్టికల్ డెమోన్‌తో పాటు హ్యాండ్స్-ఆన్ సెషన్స్ నిర్వహించి, కోడింగ్ నైపుణ్యాలను మెరుగుపరుచుకునే విధంగా మార్గనిర్దేశం చేశారు. ఈ రెండు రోజుల వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు ఆధునిక సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో కీలకమైన జావా, పైథాన్ భాషలపై మెరుగైన అవగాహనను, భవిష్యత్ ఉద్యోగావకాశాలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కళాశాల విభాగాధిపతి డా.డి.రత్న కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగ ప్రొఫెసర్స్ డా.యన్ నాగాంజనేయులు, డా.బి.శ్రీనివాస రావు పాల్గొన్నారు. ఈ వర్కుషాప్ కు ఐటీ విభాగ సీనియర్ అధ్యాపకులు ఎం. రాజేష్ రెడ్డి, వి. వి కృష్ణా రెడ్డి కో ఆర్డినేటర్లు గా వ్యవహరించారు.

## నేడు శ్రీకృష్ణ దేవరాయల ఉత్సవాలు ప్రారంభం

### ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

### ఉత్సవాలు ప్రారంభించనున్న జస్టిస్ దుర్గాప్రసాద్



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని శ్రీకాకుళంలో శ్రీకృష్ణ దేవ రాయ మహోత్సవాలను నేడు విశ్రాం త హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర ప్రభుత్వ హైపవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ యూవీ దుర్గాప్రసాద్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రారంభిస్తారని స్థానిక శాసనసభ్యులు మండలి బు ద్ధప్రసాద్ సోమవారం తెలిపారు. శ్రీకాకుళంలోని ఆంధ్ర మహా విష్ణు వుగా ఖ్యాతి గాంచిన శ్రీకాకుళేశ్వర స్వామి వారి దేవస్థానంలో రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో వేటూరి సుందర రామమూర్తి రచించిన 'సిరికాకొలను చిన్నది' నృత్య నాటికను ప్రసిద్ధ నాట్య కళాకారిణి స్మితా మాధవ్ బృందం ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ వేడుకల్లో వేటూరి సుందర రామమూర్తి సతీమణి సీతామహాలక్ష్మమ్మను సత్కరించనున్నట్లు బుద్ధప్రసాద్ తెలిపారు. 1518 ఫిబ్రవరి 11వ తేదీన శ్రీకృష్ణ దేవరాయల వారు శ్రీకాకుళం వచ్చినట్లు శాసన ఆధారాల ప్రకారం 2007నుంచి శ్రీకృష్ణ దేవరాయ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ ఉత్సవాలను ముందుకు తీసుకు వెళ్ళలేదన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం ఈ ఉత్సవాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఆంధ్ర మహా విష్ణువు శ్రీకృష్ణ దేవరాయలుకు కలలో కనిపించి దేశ భాషలందు తెలుగు లెస్స అని ప్రకటించి తెలుగులో కావ్యం వ్రాయమని ఆదేశించటం, తత్ఫలితంగా ఆముక్త మాల్యద గ్రంధ రచనకు శ్రీకృష్ణ దేవరాయలు శ్రీకారం చుట్టిన మహత్యం సందర్భాన్ని గుర్తు చేస్తూ తెలుగు భాష పరిరక్షణకు ఈ ఉత్సవాలు దోహద పడతాయన్నారు..

## చోరపూడి సర్పంచ్ కుటుంబ సభ్యులకు పరామర్శ



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని చోరగుడి గ్రామంలో కందిమళ్ళ విజయ దుర్గ గోపాల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మరణించగా కుటుంబ సభ్యులను పామర్రు మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా గోపాల్ సోదరుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు, గ్రామ సర్పంచ్ పూర్ణకుమారి దంపతులను పరామర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ తో పాటు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్ బాబు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీటీఎఫ్ రాష్ట్ర జి.ఓ ల కమిటి సభ్యులుగా పి.దుర్గాప్రసాద్ ఎన్నిక



**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎంపిక రాష్ట్ర ఏపీటీఎఫ్ అ ధ్యక్షులుగా చెన్నుపాటి మంజుల, కార్యదర్శిగా కె.బసవ లింగం ఎన్నికైనారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన పెండెం వెంకట దుర్గాప్రసాద్ ఏపీటీఎఫ్ రాష్ట్ర జి.ఓల కమిటి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.దుర్గాప్రసాద్ ఎన్నిక పై హర్షం వ్యక్తం చేసిన మిత్రులు,తోటి ఉపాధ్యాయులు అయిన వి.నరేంద్ర మాస్టర్ అభినందనలు తెలియచేస్తూ వారు సంఘానికి ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తు ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ రాష్ట్ర కౌన్సిలర్ గా, జి.ఓ ల కమిటి సభ్యులుగా ఎంపికయ్యారు అని వారు మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని కోరారు.

## రైతు సంఘాల పనితీరుపై అవగాహన



**ఘంటసాల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని విజ యశ్రీ మండల మహిళ సమాఖ్యలో సోమవారం రై తు ఉత్పత్తి దారుల సంఘం సమావేశం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిధిగా కెవి కేసమన్వయకర్త డా. డి. సుధా రా ణీ పాల్గొని ప్రసంగిస్తూ రైతు సహకార సంఘం ఏర్పాటు, పనితీరు గురించి కు లంకుషంగా చర్చించారు.. సమావేశంలో మ్యాచింగ్ గ్రౌండ్స్, ఆదాయ అభి వృద్ధి కార్యమాల కొరకు రైతు సంఘలకు లోన్ల మంజూరు విషయమై తెలి యజేశారు. కెవికే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి. కృష్ణవేణి మాట్లాడుతూ గుర్రపు డెక్కతో ఉత్పతుల గురించి వివరించారు. డిపిఎం సుధాకర్, ఏపీఎం శ్రీనివా స్, సిసిరూప్సీరాణి, సీఆర్పీలు రైతు సంఘాలు ఈసీ సభ్యులు పాల్గొన్నారు..

# రాజధాని పనులకు గ్రీన్ ఛానల్‌లో గ్రావెల్






**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** నవ్య రాజధాని అమరావతి పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో అత్యాధునిక, పర్యావరణహిత మౌలిక వసతుల పనులకు అవసరమైన గ్రావెల్‌ను గ్రీన్ ఛానల్ ద్వారా సరఫరాకు సమన్వయ శాఖల అధికారులతో కలిసి కృషిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారికి వివరిం చారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల మూడో సదస్సు జరిగిం ది. ఈ సదస్సుకు కలెక్టర్ లక్ష్మీశ.. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబుతో కలిసి కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు. సదస్సులో జరిగిన చర్చ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ గౌరవ ముఖ్యమంత్రికి గ్రావెల్, మెటీరియల్ సరఫరాకు ఎక్కడా ఎలాంటి అడ్డంకులు లేకుండా జిల్లాలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. రహదారులు, ఇతర నిర్మాణ పనులకు అవసరమైన గ్రావెల్ వంటి వాటికి కొరత లేకుండా చూస్తున్నామని.. ఇటీవల జిల్లాస్థాయి ప్రత్యేక కమిటీ సమావేశం కూడా నిర్వ హించినట్లు తెలిపారు. ప్రస్తుత లీజులను సమీక్షించుకుంటూ కొత్తవాటి క్వారీ లీజుల దరఖాస్తులను వీలైనంత త్వరగా సింగిల్ విండో ద్వారా పరిష్కరించే దుకు చొరవ చూపుతున్నట్లు తెలిపారు. మైన్స్, అటవీ, పర్యావరణ శాఖ అధికారులతో కూడిన బృందాలు జాయింట్ ఇన్‌స్పెక్షన్ ప్రక్రియను చేపడుతున్నాయని వివరించారు. ప్రభుత్వ విధానాలు, చట్టాలు, పర్యావరణ నిబంధనలను పూర్తిగా పాటిస్తూ గ్రావెల్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూస్తామని, ఈ అంశాన్ని జిల్లా స్థాయిలో అత్యంత ముఖ్యమైన కార్యాచరణగా పరిగణించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

# సీఎం సహాయనిధి ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక ఊరట



**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** సింగ్ నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాల యంలో సోమవారం 23వ డివిజన్ సూర్యారావుపేటకు చెందిన మేఘనాథ్‌కు రూ.2,45,000, 59వ డివిజన్ సింగ్ నగర్‌కు చెందిన కటికల అనిత కుమారికి రూ.43,000, విజయశ్రీకి రూ.46,000 మొత్తం రూ.3,34,000 విలువ చేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు నిజంగా ఒక వరంలా మారిందని, ఈ సహాయం ద్వారా అనేక కుటుంబాలకు ఆర్థిక ఊరట లభిస్తోందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రజలను ఆదుకోవడం నిరంతరంగా కొనసాగుతోందని అన్నారు. 20142019 మధ్యకాలంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కార్యాల యానికి వచ్చిన ప్రతి అర్జీని ముఖ్యమంత్రి కార్యాలయానికి తీసుకెళ్లి, కోట్ల రూపాయల సహాయాన్ని చెక్కుల రూపంలో ప్రజలకు అందించడంలో పూర్తి బాధ్యతగా పనిచేశానని చెప్పారు. ప్రజలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకుండా సహాయం అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం మళ్లీ శాసనసభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఇప్పటివరకు రూ.3 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రజలకు అందించగలిగినందుకు సంతోషంగా ఉందని, ప్రతి అర్జీని పరిశీలించేందుకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి, చెక్కులు మంజూరు అయిన వెంటనే లబ్ధిదారులకు అందజేస్తు న్నామని తెలిపారు. ప్రజల సేవే తన లక్ష్యమని, పదవి అలంకారం కాదు బాధ్యత అని, ప్రతి శుక్రవారం జరిగే ప్రజా దర్బార్ ద్వారా వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత సమర్థంగా ప్రజల కోసం పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, డివిజన్ అధ్యక్షులు రాజన బంగారు నాయుడు, ప్రధాన కార్యదర్శి బుదాల సురేష్, ఎన్‌టీఆర్ జిల్లా పార్లమెంట్ కార్యదర్శి షేక్ గౌసియా, షేక్ ఫర్వీన్, రత్నకుమారి, హారమ్మ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ పై దండయాత్ర కార్యక్రమంలో కూటమి నాయకులు





**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి కొండూరులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డ్రగ్స్ నిర్మూలన కొరకై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు ఐపీఎస్ వారు డ్రగ్స్ పై దండయాత్ర అని సైకిల్ ర్యాలీలు జిల్లా అంతటా నిర్వహించడం జరుగుతుంది. దీనిలో భాగంగా సోమవారం కట్టుబడిపాలెం నుండి జి కొండూరు గ్రామంలోకి సైకిల్ ర్యాలీ రాగా జి.కొండూరు వై జంక్షన్ వద్ద స్వాగతం పలికి వారిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం వివేకానంద స్కూల్ ప్రాంగణంలో జరిగిన డ్రగ్స్ పై దండయాత్ర సభలో పాల్గొని రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో డ్రగ్స్ అనేది లేకుండా చేయాలని కృత నిశ్చయంతో పనిచేస్తుందని దానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉయ్యూరు నరసింహారావు, జి కొండూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు వేములకొండ వెంకటేశ్వరరావు లంక నాగేశ్వరావు జి కొండూరు ఎంపీపీ వేములకొండ తిరుపతమ్మ సర్పంచ్ మండల్ అరుణ మైలవరం నియోజకవర్గ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి అంకెం సురేష్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పజ్జూరు వెంకయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు పజ్జూరు విజయ్ పజ్జూరు వెంకటేశ్వరరావు (బుల్లి) గ్రామ పార్టీ కార్యదర్శి బడుగు రమేష్ ఎస్సై సతీష్ కుమార్ ఏఎస్ఐ రాఘవయ్య జి కొండూరు పోలీస్ స్టాఫ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 3డి ప్రింటింగ్ కోసం అల్ట్రా-స్ట్రాంగ్ కాంపోజిట్ మెటీరియల్‌ను అభివృద్ధి చేసిన రుసల్

**విజయవాడ, ఫిబ్రవరి 9, మేజర్ న్యూస్ :** ప్రముఖ ప్రపంచ అల్యూమినియం ఉత్పత్తిదారు అయిన రుసల్, 3డి ప్రింటింగ్ కోసం కాంపోజిట్ మెటీరియల్‌లో ఒక పురోగతిని ఆవిష్కరించింది. కొత్త మెటల్ మ్యాట్రిక్స్ కాంపోజిట్ నియమించబడిన ఆర్ఎస్770కె బలమైన అల్యూమినియం పౌడర్ మిశ్రమాల కంటే 30% ఎక్కువ తన్యత బలాన్ని అందిస్తుంది, అధిక-పనితీరు గల అనువర్తనాల్లో సంకలిత తయారీకి కొత్త సరిహద్దులను తెరుస్తుంది. ఇంట్లోనే అభివృద్ధి చేయబడిన ఆర్ఎస్770కె మిశ్రమ అల్యూమినియం మాతృకను సిరామిక్ కణాలతో కలిపి, 615 మెగాపాస్కల్స్ (ఎంపిఎ) యొక్క అద్భుతమైన తన్యత బలాన్ని సాధిస్తుంది. ఇది రుసల్ యొక్క పోర్ట్‌ఫోలియోలో బలమైన అల్యూమినియం పౌడర్ మిశ్రమం అయిన ఆర్ఎస్553 మిశ్రమం కంటే 30% పెరుగుదలను సూచిస్తుంది, ఇది అరుదైన-భూమి మెటల్ స్కాండియం యొక్క అధిక శాతాన్ని కలిగి ఉంటుంది. అల్యూమినియం యొక్క సిగ్నేచర్ తేలికను నిలుపుకోవడంలో సంకలిత తయారీలో కీలకమైన అంతరాన్ని ఈ పదార్థం యొక్క ప్రత్యేక లక్షణాలు తగ్గిస్తాయి, దాని బలం లక్షణాలు ఉక్కు, టైటానియం మిశ్రమాల వైపు ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తాయి. అల్యూమినియం అత్యంత తేలికైన నిర్మాణ లోహాలలో ఒకటి, ఉక్కు కంటే దాదాపు మూడు రెట్లు తేలికైనది, టైటానియం కంటే ఒకటిన్నర రెట్లు తేలికైనది. ఆర్ఎస్770కె అనేది రుసల్ యొక్క ఆర్ & డి విభాగం అభివృద్ధి చేసిన మొదటి 3డి-ప్రింటింగ్ మిశ్రమం. గతంలో, ఈ విభాగం సంకలిత తయారీ కోసం పది కంటే ఎక్కువ అల్యూమినియం మిశ్రమాలను సృష్టించింది, ఇవన్నీ పరిశ్రమ-ప్రామాణిక అల్సి10ఎమ్‌జి పౌడర్ మిశ్రమం కంటే బలం, వేడి నిరోధకత, దిగుబడి బలం వంటి కీలక లక్షణాలను మెరుగుపరచడానికి రూపొందించబడ్డాయి. భారతదేశం ఆరోగ్య సంరక్షణ, విద్య, ఎంపిక చేసిన తయారీ రంగాలలో బలమైన సంసిద్ధతతో 3డి సాంకేతికతలను స్వీకరించడంలో వేగంగా పరిపక్వం చెందుతోంది. మెయిటీ యొక్క నేషనల్ స్ట్రాటజీ ఆన్ అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి విధాన చొరవలు భారతదేశ-నిర్దిష్ట ఏఎం సాంకేతికతలను అభివృద్ధి చేయడం, స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయడం, ఉత్పత్తులను వాణిజ్యీకరించడం, నైపుణ్యం కలిగిన సిబ్బందికి శిక్షణ ఇవ్వడం వంటి స్పష్టమైన లక్ష్యాలను అందిస్తాయి. ఉదాహరణకు, ఈ వ్యూహం స్పష్టంగా 50 భారతదేశ-నిర్దిష్ట ఏఎం టెక్నాలజీలను అభివృద్ధి చేయడం, 100 కొత్త ఏఎం స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయడం, 500 ఏఎం ఉత్పత్తులను వాణిజ్యీకరించడం, 10 తయారీ రంగాలను ఏఎం కి తెరవడం, 100,000 మంది నైపుణ్యం కలిగిన వ్యక్తులకు శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ విధాన సంకేతం ఇప్పటికే సంస్థలు, పరిశ్రమలలో ప్రవర్తనను మారుస్తోంది. “భారతదేశం బలమైన విధాన మద్దతు, వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక స్థావరం, అధునాతన పదార్థాలపై స్పష్టమైన దృష్టితో ఆశాజనకమైన సంకలిత తయారీ పర్యావరణ వ్యవస్థలను కలిగి ఉంది” అని రుసల్‌లోని ప్రాంతీయ అమ్మకాల అధిపతి రోమన్ బోరిసోవ్ అన్నారు. “ఆర్ఎస్770కె ఈ అల్ట్రా-స్ట్రాంగ్ కాంపోజిట్‌ను ఉపయోగించి ఏరోస్పేస్, ఆటోమోటివ్, ఇతర వ్యూహాత్మక రంగాలలో తేలికైన, అధిక-పనితీరు గల భాగాలను అభివృద్ధి చేయడానికి భారతీయ రాజువీలు, సర్వీస్ బ్యూరోలు, పరిశోధనా కేంద్రాలకు అద్భుతమైన సామర్థ్యాన్ని అందిస్తుంది.” ఈ సందర్భంలో, ఆర్ఎస్770కె వంటి అధిక-పనితీరు గల కాంపోజిట్ పదార్థాలు భారతీయ తయారీదారులకు మద్దతు ఇవ్వగలవు, ఎందుకంటే వారు డిమాండ్ ఉన్న అప్లికేషన్ల కోసం లోహ సంకలిత తయారీ వినియోగాన్ని పెంచుతారు, ఏరోస్పేస్, అణుశక్తి, విద్యుత్ చలనశీలత, మౌలిక సదుపాయాల వంటి రంగాలలో తేలికైన, బలమైన, మరింత సంక్లిష్టమైన భాగాలను అనుమతిస్తుంది.

# వాస్తవాలను జీర్ణించుకోలేక కనపర్తిపై విమర్శలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడిన వాస్తవాలను జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు అర్థం లేని విమర్శలు చేస్తున్నారని టీడీపీ నాయకులు మండిపడ్డారు. సోమవారం స్థానిక నియోజకవర్గ టీడీపీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ వైసీపీ నేతల తీరును తీవ్రంగా ఖండించారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో భక్తుల మనోభావాలు దెబ్బతిన్న మాట వాస్తవమని విచారణ సంస్థలు నిజానిజాలు బయటపెడుతుంటే, తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఎదురుదాడి చేయడం వైసీపీ నేతలకు అలవాటుగా మారిందని భక్తుల మనోభావాలతో ఆడుకున్న వారికి కాలమే సమాధానం చెబుతుందని మండిపడ్డారు. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్న కనపర్తి శ్రీనివాసరావు ను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా తమ ఉనికిని కాపాడుకోవాలని వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కులాల మధ్య చిచ్చు పెట్టే సంస్కృతి వైసీపీదేనని, కూటమి ప్రభుత్వం అందరినీ కలుపుకుని అభివృద్ధి పథంలో సాగుతోందని వారు స్పష్టం చేశారు. అసెంబ్లీ సాక్షిగా సభ్య సమాజం తలదించుకునేలా మాట్లాడిన చరిత్ర వైసీపీ నాయకులదని అంబటి రాంబాబు మహిళల పట్ల ప్రవర్తించిన తీరుపై ప్రజాగ్రహం వ్యక్తమైతే, దాన్ని రాజకీయం చేయడం సిగ్గుచేటని తప్పు చేసి క్షమాపణలు చెబితే సరిపోదని, ప్రజల ముందు దోషులుగా నిలబడక తప్పదని హెచ్చరించారు గత ఐదేళ్లలో అవనిగడ్డ నియోజకవర్గాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ నేతలు, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని మీడియా ముందుకు వస్తున్నారని ప్రశ్నించారు. మా నాయకులు లోకేష్ ప్రవేశపెట్టిన 'రెడ్ బుక్' చట్టాన్ని ఉల్లంఘించిన వారి కోసమే తప్ప, సామాన్య ప్రజల కోసం కాదని గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలు తిరస్కరించినా వైసీపీ నేతల్లో మార్పు రాకపోవడం విచారకరమని, ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో ప్రజలే మీకు తగిన రీతిలో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు మిమ్మల్ని ఎందుకు ఓడించారో ఇప్పటికీ మీకు అర్థం కాకపోవడం విచారకరమని ఇప్పటికైనా మురుగు కాలువ లాంటి మాటలు కట్టిపెట్టి, నిర్మాణాత్మకమైన ప్రతిపక్షంగా వ్యవహరించాలని సూచించారు. అవనిగడ్డలో కుల రాజకీయాలకు, భౌతిక దాడుల సంస్కృతికి తావులేదని, అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొల్లూరి ఇమ్మానియేలు, పార్టీ నాయకులు మండలి రామమోహనరావు, బండే రాఘవ, ఘంటసాల రాజమోహన రావు, దాసినేని శ్రీనివాసరావు, చెన్ను బాబూరావు, మేడికొండ విజయ్, నాగిడి రాంబాబు, గుంటూరు వినయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమము, అభివృద్ధి, సుపరిపాలనకు అత్యంత ప్రాధాన్యత





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమము, అభివృద్ధి, సుపరిపాలనకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని అందుకు అనుగుణంగా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సోమవారం సీఎం అమరావతి సచివాలయం నుండి రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్, వివిధ ప్రభుత్వ శాఖల కార్యదర్శులతో సమావేశం నిర్వహించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కృష్ణాజిల్లా గ్రాస్ జిల్లా డొమెస్టిక్ ప్రోడక్ట్ ( జిడిడిపి) 2024-25 లో 88,584 కోట్ల రూపాయల తో నాలుగో ర్యాంకులో ఉండగా 2025-26 లో 98,801 కోట్ల రూపాయలతో మూడో ర్యాంకుకు చేరుకుందన్నారు. అలాగే గ్రాస్ డొమెస్టిక్ ప్రోడక్ట్ తలసరి ఆదా యంలో కృష్ణాజిల్లా 2024-25 లో 4,08,829 కోట్ల రూపాయలతో రెండవ స్థానంలో నిలిచిందని, 2025- 26 లో కూడా 4,82,075 కోట్ల రూపా యలతో రెండవ ర్యాంకు నిలబెట్టుకుందన్నారు. పి ఫోర్ ద్వారా ఆర్థిక అసమా నతలను తగ్గించి అన్ని కుటుంబాలకు సంక్షేమం అందేలా చూడాలన్నారు. వ్యవసాయము దాని అనుబంధ రంగాలకు సంబంధించి 2024-25లో కృష్ణాజిల్లా 39,028 కోట్ల రూపాయలతో రెండవ ర్యాంకులో నిలిచిందని, 2025-26 లో 48,499 కోట్ల రూపాయలతో యధావిధిగా రెండవ ర్యాంకులోనే కొనసాగిందన్నారు. అమరావతి రాజధానికి మట్టితోలకంలో కాంట్రాక్టర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సీఎం కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ విషయమై కలెక్టరేట్లోని వీసీ హాల్ నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వెంటనే స్పందించి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం గన్నవరం ప్రాంతం నుండి మట్టి తోలడం జరుగుతుందని, ఇంకనూ బాపులపాడు మండలంలో 80 ఎకరాల భూములను గుర్తించామని అక్కడనుండి కూడా మట్టితోలెందుకు కాంట్రాక్టర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని ఏ సమస్య ఉన్న తప్పకుండా పరిష్కరిస్తామని సీఎంకి తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సో జిల్లా నుంచి జిల్లా ఎస్పీ వీ. విద్యాసాగర్ నాయుడు, సంయుక్త కలెక్టర్ నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, జడ్పీ డిప్యూటీ సీఈఓ ఆనంద కుమార్, డ్వామా, డిఆర్డిఏ పిడి లు శివప్రసాద్, హరిహరనాద్, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నర్సింహులు, ఐసి డి ఎస్ పి డి ఎం ఎన్ రాణి, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, ఉద్యాన అధికారీ జ్యోతి, మత్స్యశాఖ అధికారి అయ్యా నాగరాజా, పంచాయతీ పంచాయతీరాజ్ ఎస్ ఈ రమణరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఐపిఒ బలోపేతానికి ఎన్ఎస్ఇ బోర్డు నిర్ణయాలు

**విజయవాడ, ఫిబ్రవరి 9, మేజర్ న్యూస్ :** లిస్టింగ్ విధానక్రమాన్ని పర్యవేక్షించి, నడిపించడానికిగానూ ప్రత్యేకంగా ఐపిఒ కమిటీని తిరిగి నియమించడం ద్వారా ఎన్ఎస్ఇ తన ఐపిఒ పాలనా చట్రాన్ని బలోపేతం చేసింది. టాబ్లేష్ పాండే .ఛైర్ పర్సన్ (నాన్ ఇండిపెండెంట్ డైరెక్టర్), శ్రీనివాస్ ఇంజెటి – సభ్యులు (పబ్లిక్ ఇంటరెస్ట్ డైరెక్టర్),ప్రొఫెసర్ (డా.) మమతా బిస్వాల్ – సభ్యులు (పబ్లిక్ ఇంటరెస్ట్ డైరెక్టర్),జస్టిస్ (రిటైర్డ్) . అభిలాష కుమారి – సభ్యులు (పబ్లిక్ ఇంటరెస్ట్ డైరెక్టర్), ప్రొఫెసర్. జి. శివకుమార్ – సభ్యులు (పబ్లిక్ ఇంటరెస్ట్ డైరెక్టర్), ఆశీష్ కుమార్ చౌహాన్ – సభ్యులు (మేనేజింగ్ డైరెక్టర్ & సిఇఒ),లుగా నియామకాలు జరిగాయి. బొగ్గు వినిమయం కోసం పూర్తి యాజమాన్యంలో వుండే అనుబంధ సంస్థ ఏర్పాటులికు ఎన్ఎస్ఇ బోర్డు అనుమతించింది, ఇది నియంత్రణా సంస్థల అనుమతులు పొందాల్సి వుంటుంది. ఈ ప్రతిపాదిత అనుబంధ సంస్థకు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ అనుమతించినట్టుగా నేషనల్ కోల్ ఎక్స్ ఛేంజ్ / భారత్ కోల్ ఎక్స్‌ఛేంజ్ / ఇండియా కోల్ ఎక్స్ ఛేంజ్ అని పేరు పెట్టవచ్చునని బోర్డు తెలపింది. బొగ్గు మంత్రిత్వశాఖ జారీచేసిన ప్రతిపాదిత బొగ్గు నియంత్రణలు, 2025 లకి అనుగుణంగా వుంటుంది. ఈ ప్రతిపాదిత కోల్ ఎక్స్ ఛేంజ్ అనుబంధసంస్థలో రూ 100 కోట్ల వరకూ మూలధనం పెట్టడానికి ఎన్ఎస్ఇ అనుమతించింది. https://www.nseindia.com/static/investor-relations/announcements మరిన్ని వివరాలకు బోర్డు సమావేశం నిర్ణయాల లింకును చూడవచ్చు.

## శంభో ఫౌండేషన్ వారి అన్నప్రసాద వితరణ

**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** శంభో ఫౌండేషన్ వారు వృద్ధులకు, అనాధలకు, బిచ్చగాళ్లకు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శంభో ఫౌండేషన్ వారు ఇబ్రహీంపట్నం ఆంధ్రప్రదేశ్ మీలో ప్రాణశక్తి వృద్ధి చెందాలి అంటే“ శంభో “ శబ్దాన్ని నిత్యం జపం చేయండి అంటూ శంభో ఫౌండేషన్ కమిటీ మెంబర్స్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అనాధలు వృద్ధులు ఇంత మంచి కార్యక్రమాల నూ మీరు చేపడుతూ మాలాంటి నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి కడుపు నింపుతున్నందుకు మీకు ధన్యవాదాలు అంటూ వారితో మమేకమై హర్షం వ్యక్తం చేశారు.

## ఆలయ నిర్మాణానికి నూలు నరసింహారావు విరాళం

**హనుమాన్ జంక్షన్, పిబ్రవరి 9, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన బాపులపాడు గ్రామంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న శ్రీ హరిహరసుత అయ్యప్ప స్వామి వారి దేవస్థానం నిర్మాణానికి హనుమాన్ జంక్షన్‌కు చెందిన అన్నపూర్ణా ఏజెన్సీస్ అధినేత నూలు నరసింహారావు తన జన్మదినం సందర్భంగా సోమవారం రూ.50,116 విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ లయన్ గూడపాటి రత్నశేఖర్, కొల్లి వెంకటరావు, కాకుల శ్రీనివాసరావు, గూడవల్లి చిన్నా, వీరమాచినేని నాగయ్య తదితరులు దాతకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే నూలు నరసింహారావును జన్మదిన శుభాకాంక్షలతో శాలువాతో సన్మానించారు.

## హెల్త్ అసిస్టెంట్ నాగరాజు మృతి

**మొవ్వ మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వాకా నాగరాజు(43) అనారోగ్యంతో మృతి చెందినట్లు ఆరోగ్య కేంద్రం సిబ్బంది తెలిపారు. నాగరాజు గత కొంతకాలంగా మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. నాగరాజు మండల కేంద్రమైనమొవ్వ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో అద్దెకు ఉంటున్నాడు. ఈనెల 8వ తేదీ రాత్రి 9 గంటలకు నాగరాజుకు సీరియస్ గా ఉండటంతో హుటా హుటీనా కూచిపూడిలో గల రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యశాలకు మెరుగైన వైద్య నిమిత్తం తరలించారు. సంజీవిని వైద్యశాల వైద్యులు పరీక్షించి అప్పటికే నాగరాజు మృతి చెందినట్లు నిర్ధారించారు. నాగరాజు భౌతికయాన్నిఆయన స్వగ్రామమైన చల్లపల్లి గ్రామానికి తరలించి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్. సి. హెచ్.రాజేశ్వరి, యు డి సి రామ శైలజ, పీహెచ్ఎన్ డి. శ్రీలక్ష్మి, విజయ్ కుమార్, పలువురు ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు నాగరాజు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నాగరాజుకు భార్య, తల్లి ఉన్నారు.

## అంబేద్కర్ మార్గంలో హక్కుల సాధనకు ముందడుగు..

**గన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వీర బత్తిన అమల్ దాస్ ని నియోజకవర్గ షెడ్యూల్డ్ కులాల విభాగం అధ్యక్షులుగా నియమించిన సందర్భంగా సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది అమర్తల సోమేశ్వరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమల్ దాస్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి నియోజకవర్గ షెడ్యూల్డ్ కులాల విభాగం అధ్యక్షులుగా నియమించినందుకు ముందుగా ఎమ్మెల్యేయార్లగడ్డకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన అమర్తల సోమేశ్వరావు, వారి బృంద సభ్యులందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి కార్మిక సంఘ నిర్వాహక కార్యదర్శి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సామాజిక సమన్వయకర్త నాగ ప్రసాద్ బుస్సే, ఉమ్మడి జిల్లా మాల మహానాడు కార్యదర్శి, విజిలెన్స్ పర్యవేక్షణ సభ్యులు రాంబాబు, మహిళా నాయకురాలు మరియమ్మ, మండల మైనారిటీ అధ్యక్షులు షేక్ రహీంతుల్లా (న్యాయవాది), వినోద్ కుమార్, విమల్ పాల్గొన్నారు.

# లడ్డూ కల్తీ వ్యవహారంలో ఎంతటి వారు ఉన్నా శిక్ష తప్పదు

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ




**గన్నవరం, ఫిబ్రవరి 9, మేజర్ న్యూస్ :** సినీ నిర్మాత బండ్ల గణేష్ చేపట్టిన 'సంకల్ప యాత్ర' సోమవారం నాటికి తిరుపతికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. బండ్ల గణేష్ రాత్రికి అలిపిరిలో బస చేసి, మంగళవారం ఉదయం మెట్ల మార్గం ద్వారా తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకోనున్నారు, ఆపై తన యాత్రను ముగిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ టీటీడీ లడ్డూ కల్తీ అంశంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. లడ్డూ కల్తీ వ్యవహారంలో ఎంతటి వారు ఉన్నా కూటమి ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలోని పెద్దలకు తెలియకుండా ఇలాంటి కల్తీ జరిగే అవకాశం లేదని ఆరోపించారు. అప్పటి టీటీడీ బోర్డు కూడా దీనికి బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. వంద కోట్ల మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గత ప్రభుత్వం వ్యవహరించిందని ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఆవులు బంగ్లాదేశ్‌కు తరలిపోయాయని సంచలన ఆరోపణలు చేశారు.

టీటీడీకి అవసరమైన నెయ్యి కోసం తగినన్ని ఆవులను వృద్ధి చేయాలని ఆయన సూచించారు. వైసిపి నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నప్పటికీ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వారు డైవర్ట్ అవ్వరని పేర్కొన్నారు. అప్పటి టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి ఆస్తులపై కూడా విచారణ జరపాలని ఒక భక్తుడిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. టీటీడీని పూర్తిగా ప్రక్షాళన చేయాలని, అక్కడ కేవలం హిందువులే ఉండాలని అభిప్రాయపడ్డారు. అలాగే వైసిపి నాయకులకు తెలుగు భాష నేర్పించాలని, బూతులు మాట్లాడే వారిని జైల్లో పెట్టేలా చట్టాలు రావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కూడా పాల్గొన్నారు.

# మేరీ మాత ఉత్సవాలలో ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణ అందిస్తున్నాం







**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 9, 10, 11వ తేదీల్లో జరిగే గుణదల మేరీ మాత ఉత్సవాలలో పాల్గొనే ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుధ్య నిర్వహణలో లోపం లేకుండా చూసుకుంటున్నామని, భక్తులకు కొరకు 2000 లీటర్ల కెపాసిటీ గల ఐదు స్టీల్ ట్యాంకర్లలో తాగునీరు, 50వేల వాటర్ బాటిల్స్, 440 పారిశుద్ధ్య కార్మికులతో పారిశుధ్య నిర్వహణ, 2 ప్రదేశాలలో 20 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని అన్నారు. ఉత్సవాలకు వచ్చే మేరీ మత భక్తులకు విజయవాడ నగరపాలక సంస్థ వారు కల్పించే తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి అంతరాయం లేకుండా, అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ నిత్యం పర్యవేక్షిస్తూ ఉన్నారని కమిషనర్ అన్నారు.

# ఎన్ఐఆర్‌డిలో ఎస్.హెచ్.జి మహిళలకు 11వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ ప్రారంభం





**విజయవాడ మేజర్ న్యూస్ :** ఎంపీ కేశినేని శివనాథ్ సారధ్యంలో కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ విధానం పై ఐదు రోజుల పాటు శిక్షణ పొందేందుకు హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డికి వెళ్లిన 40 మంది ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎస్.హెచ్.జి మహిళలకు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభం అయ్యాయి. 11వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కు వెళ్లిన వీరికి ఫిబ్రవరి 9 నుంచి 13వ తేదీ వరకు ఐదు రోజులు పాటు హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ విధానం పై శిక్షణ వుంటుంది. ఈమేరకు ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఈ ఐదు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం ప్రారంభ సమావేశం ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్. లో సోమవారం అసోసియేట్ ప్రోపెసర్ (సి.ఐ.ఎ.టి.ఎస్.జె –హెడ్) డాక్టర్ సి.కత్తిరేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రమేష్ శక్తివేల్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మ హ్మద్ ఖాన్, సంబంధించి గాంధీ హ్యాండ్ మేడ్ పేపర్ యూనిట్ అధికారి జె.రవీంద్రరావు శిక్షణ తీసుకునే 40 మంది ఎస్.హెచ్.జి మహిళలకు ముందుగా హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ విధానం శిక్షణ తరగతుల కార్యక్రమాల గురించి, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయతీ రాజ్ గురించి వివరించారు. మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ లో శిక్షణ పొందే వారికి మొదటి రోజు శిక్షణలో భాగంగా గాంధీ హ్యాండ్ మేడ్ పేపర్ యూనిట్ అధికారి జె.రవీంద్రరావు నేతృత్వంలో బేసిక్స్ ఆఫ్ హ్యాండ్ మేడ్ పేపర్ టెక్నాలజీ, కావాల్సిన ముడి పదార్థాలు వాటి లక్షణాలు, తయారీ ప్రక్రియ, ఉపయోగాలు సవివరంగా తెలియజేయటం జరిగింది. అలాగే ఫోటో ఫ్రేమ్ డిజైన్స్, మెటీరియల్ సెలక్షన్ గురించి, ఎల్.పోల్డర్ తయారీ పై, ఫైల్ తయారీ కోసం కొలతలు ఏ విధంగా తీసుకోవాలి, ఫైల్స్ డిజైన్ ఎలా వుండాలి...హ్యాండ్ ఆన్ పోల్డర్ గురించి అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం వీటిని ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చారు. స్వయం ఉపాధి నెలకొల్పుకునేందుకు శిక్షణ కార్యక్రమంకు పంపించినందుకు ఎంపీ కేశినేని శివనాథ్ తో పాటు కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డికి శిక్షణ పొందుతున్న మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.



## జయపురంలో సిసి రోడ్లు, స్లాబ్ కల్వర్టులు ప్రారంభం

**కోడూరు మేజర్ న్యూస్ :** అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అభివృద్ధి పనులు ప్రారంభించారు. కోడూరు మండలంలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. జయపురంలో రూ.14.30లక్షలతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లు, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర రూ.20 లక్షలతో నిర్మించిన రెండు శ్లాబు కల్వర్టులు, నాలుగు తూము కల్వర్టులు ప్రారంభించారు. జడ్పీ నిధులు రూ.12.50లక్షలతో నిర్మించిన మైక్రో ఫిల్టర్ కం ప్లాట్ ఫామ్ ప్రారంభించారు. రామకృష్ణాపురంలో రూ.36లక్షలతో గ్రామీణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

## శివుని కళ్యాణానికి చురుగ్గా ఏర్పాట్లు



**విస్సన్నపేట మేజర్ న్యూస్ :** విస్సన్నపేట మండలం కొండపర్వ గ్రామంలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబిక మల్లేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విస్స న్నపేట మండల సబ్ ఇన్స్పెక్టర్ అర్జున్ రాజు పర్యవేక్షించారు.

## ప్రారంభమైన పదవ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు



**మొవ్వ మేజర్ న్యూస్:** మండలంలో గల జిల్లా పరిషత్, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు 462 మందికిగాను 455 మంది హాజరైనట్లుమండల విద్యాశాఖ అధికారిణి–2 కే. శ్రీలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన మొవ్వ పి.ఎం మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోపరీక్షాకేంద్రాన్ని ఎంఇఓ–2 తనిఖీచేశారు. అలాగే కూచిపూడి జిల్లా పరిషత్ ప్రాజ్యన్నత పాఠశాల, పెద ముత్తేవి లక్ష్మీపతి స్వామి విద్యా విహార్ సంస్కృతోన్నత విద్యాలయం తో పాటు మొవ్వ, కోసూరు, కాజ, నిడుమోలు, చినముత్తేవి, పెదసనగల్లు, భట్లపెనుమర్రు జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు కూచిపూడి,మొవ్వ, కోసూరు, కాజ, నిడుమోలులలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో ఈ పరీక్షలు జరుగుతున్నాయని ఈ పరీక్షలు ఈనెల 19వ తేదీ వరకు జరగనున్నాయని ఎంఇఓ–2 లక్ష్మీ తెలిపారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999